మాణిక్యాంబ 'మా రాఘవుడికి పెళ్లాం పుట్టిందని' సంబరపడింది. మీనాక్షమ్మకూడా 'మా అల్లుడు, మా అల్లుడం'టూ రాఘవుడికి మర్యాదలు చేస్తోండేది.

కాని రంగనాథరావుకి ప్రమోషను వచ్చినకొద్దీ, బావమరుదులమధ్య అంతరం ఎక్కువైంది. ఆ గుమాస్తా తాసిల్దారై పదేకరాలు పద్దెనిమిదెకరాలవటంతో, 'అల్లుడు' 'మేనల్లుడై' పోయాడు. డిప్యూటీ కలెక్టరై 'రావు సాహెబు' రావటంతోనే రాఘవుడు ఉత్తి 'రాఘవుడై' ఊరుకున్నాడు.

'కలిపోసినా ఉట్టివంకే చూపించా'న్నట్లు. మాణిక్యాంబ మాత్రం ఇంకా వసుంధర్ని తన కోడలుగానే భావిస్తోండేది. పెద్దాడవారి మురళీకృష్ణకి వసుంధర్నిచ్చి చేయటానికి నిశ్చయించి, తన అన్న తాంబూలాలు ఇచ్చి వచ్చాడనేదాకా ఆవిడ వసుంధరమీద ఆశపెట్టుకునే ఉంది. ఆ సంగతి తెలిశాక, బాధపడి, మొగుడుతో 'చూశారా, ఎంతపని చేశాడో! పిల్ల పుట్టినప్పట్నుంచీ మనవాడికిచ్చి చేస్తానంటూ వచ్చి, ఆఖరికి పైగా వెళ్లాడు' అని వాపోయింది. ఆయన ఒక్కమాటాడి ఆవైపు తీక్షణంగా చూసి, 'ఐతే, మీవాడు తన కూతుర్ని ఇవ్వకపోతే మన రాఘవరావుకి పెళ్ళి అవదనా ఈ దేవుళ్ళాడటం? మనకి తగ్గవాడెవరో ఒకడు వీడికోసం వెతుక్కుంటూ వస్తాడు. ఆనర్సు ప్యాసైన కుర్రాడు నిక్షేపంగ కట్నం కానుకలతో వస్తుంది. పిల్లెవరో! మీ అన్నతో వియ్యమైతే, చెల్లెలేకదా అన్న లోకువకొద్దీ, లాంఛనాలు జరపకుండా అతగాడు ఎక్కడికక్కడికే మొండిచెయ్యి చూపచ్చు. పై సంబంధమైతే ఏ మొగమాటం ఉండదు'— ఈ ధోరణిలో మాట్లాడుతూ, తమకు మేనరికం తప్పిపోవటంవల్ల లాభమేకాని నష్టం లేదంటూ నిరూపించబోయాడు కాని మాణిక్యాంబకి మనస్సు సమాధానపడలేదు. ఎంతగొప్ప సంబంధమైనా, పై సంబంధం, పై సంబంధమే. పై పిల్ల మేనకోడలితో సమమాతుందా?

వసుంధరికి పెళ్లి నిశ్చయం కావటంతోనే, మీనాక్షమ్మ పెళ్లిపనులు చేయించడం మొదలెట్టింది. ఏర్పాట్లన్నీ జరిగినట్లె. పెళ్లికొడుక్కి ఉంగరం కూడా పురమాయించేశారు. ఇలా ఉండగా తలవని తలంపుగా ఇంజనీరింగు కాలేజీనుంచి రంగనాథరావుగారికో ఉత్తరం వచ్చింది. మురళీకృష్ణ రాశాడు. తనకి ప్రస్తుతం వివాహం చేసుకోవాలని లేదనీ, చదువు పూర్తియి,

